మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక
పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 74 శుక్రవారం 22 - 08 - 2025 పేజీలు: 8 వెల: 4

## ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయండి



3లో..



### అమెరికాను టార్గెట్ చేసే
# క్షిపణులు

- చైనా సరిహద్దుకు 27 కి.మీ. దూరంలో కొరియా రహస్య అణు స్థావరం
- శాటిలైట్ చిత్రాలతో బయటపడ్డ అణు స్థావరం
- వాషింగ్టన్‌కు చెందిన సీఎస్ఐఎస్ నివేదికలో సంచలన విషయాల వెల్లడి

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: అంతర్జాతీయ సమాజం కళ్లుగప్పి ఉత్తర కొరియా మరో రహస్య క్షిపణి స్థావరాన్ని నిర్మించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చైనా సరిహద్దుకు అత్యంత సమీపంలో ఏర్పాటు చేసిన ఈ స్థావరంలో అమెరికాను సైతం లక్ష్యంగా చేసుకోగల ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు ఉన్నాయని వాషింగ్టన్‌కు చెందిన సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ 2 లో..





### నేతలు ఇష్టమొచ్చినట్లుగా ప్రవర్తిస్తే
# ఉపేక్షించేది లేదు

- ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్
- ఎమ్మెల్యేలే అడ్డగోలుగా వ్యవహరిస్తే ఎవరూ బాధ్యత వహిస్తారు
- తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఇవాళ (గురువారం) ఏపీ సచివాల యంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎం చంద్రబాబు చర్చించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. నేతలు ఇష్టమొచ్చినట్లుగా ప్రవర్తిస్తే ఉపేక్షించేంది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యేలే అడ్డగోలుగా వ్యవహరిస్తే ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఏపీలో క్రిమినల్ మాఫియా ఒకటి తయారైందని ధ్వజమెత్తారు. వీళ్ల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు వారి పరిధిలోని ఎమ్మెల్యేలను పిలిపించి వెంటనే మాట్లాడాలని సూచించారు సీఎం చంద్రబాబు. ఉదయం కేబినెట్ సమావేశానికి ముందు సీఎం నివాసంలో మంత్రి నారా లోకేష్‌తో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో మంత్రులు పాల్గొన్నారు. బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో కూడా పలు జాగ్రత్తలను మంత్రి లోకేష్ సూచించారు. ఏడుగురు ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరుపై లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి విషయం మంత్రులు లోకేష్ దగ్గర ప్రస్తావించారు. ఇలా రోడ్డు మీద పడి దాడి చేయడం ఏమిటని లోకేష్ ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే సహించేది లేదని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు కూడా చాలా సీరియస్‌గా ఉన్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు ముఖ్యంగా స్త్రీ శక్తి పథకం బాగా జనం లోకి వెళ్లాయని తెలిపారు 2 లో..

### డిజిటల్ హవాలాతో
# ఉగ్ర నిధులు!



### 313 కొత్త శిబిరాల ఏర్పాటు లక్ష్యంగా ఆన్‌లైన్ చందాలు

మన గళం డెస్క్ : ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతున్నామని ప్రపంచానికి చెబుతున్న పాకిస్థాన్, తెరవెనుక ఉగ్రసంస్థలకు అండగా నిలుస్తున్న తీరు మరోసారి బయటపడింది. అంతర్జాతీయ ఆర్థిక కార్యదళం (ఎఫ్ఏటీఎఫ్) ఆంక్షల నుంచి తప్పించుకునేందుకు, జైషే మహమ్మద్ (జైషే) ఉగ్రవాద సంస్థ 'డిజిటల్ హవాలా' అనే కొత్త మార్గాన్ని ఎంచుకున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. టెక్నాలజీని వాడుకుంటూ ఆన్‌లైన్ వేదికగా ఉగ్ర కార్యకలాపాలకు నిధులను సమీకరిస్తున్నట్లు వెల్లడైంది. పాకిస్థాన్‌లో సులభంగా అందుబాటులో ఉండే ఈజీపైసా, సదాపే వంటి డిజిటల్ వాలెట్లను ఈ ఉగ్ర ముఠా తమ కార్యకలాపాలకు అస్త్రంగా మార్చుకుంది. జైషే అధినేత మసూద్ అజార్ కుమారుడు అబ్దుల్లా, 2 లో..



### రూ.2 కోట్ల విలువైన
# ఎర్రచందనం పట్టివేత

**- లారీతో పాటు ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్**

మన గళం, విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. తాజాగా, విజయవాడ-చెన్నై జాతీయ రహదారిపై భారీ ఎత్తున ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న ముఠా గుట్టును రెడ్ శాండర్స్ యాంటీ-స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ బృందం రట్టు చేసింది. ఈ ఆపరేషన్‌లో కోట్ల 2 లో..

### ప్రియుడికోసం
# కట్టుకున్న భర్తను హత్య



మన గళం, గన్నవరం : ఓ భార్య 15 ఏళ్ల ప్రేమ, పెళ్లిని కాదని దారుణానికి ఒడిగట్టింది. కొత్త ప్రియుడితో కలిసి భర్తను చంపేసింది. కృష్ణా జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గన్నవరం మండలం వెంకట నరసింహపురానికి చెందిన లక్ష్మణ్, పావని ప్రేమించుకున్నారు. 15 ఏళ్ల క్రితం పెద్దలను ఎదురించి మరీ పెళ్లి చేసుకున్నారు. తర్వాత అదే గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. పెళ్లైన కొన్నేళ్ల పాటు వీరి కాపురం సజావుగానే సాగింది. వీరి అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా ఇద్దరు ఆడపిల్లలు 2 లో..

### అన్ని రకాల
# మనీ గేమ్స్‌పై నిషేధం



మన గళం, న్యూఢిల్లీ : ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025 .. పార్లమెంట్‌లో పాసైంది. ఇవాళ రాజ్యసభలో ఆ బిల్లుకు ఆమోదం దక్కింది. విపక్షాలు తీవ్ర ఆందోళన చేపడుతున్న నేపథ్యంలోనే బిల్లును పాస్ చేశారు. ఎటువంటి చర్చ లేకుండానే బిల్లుకు పచ్చజెండా ఊపారు. కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్‌లో జరిగే అన్ని రకాల మనీ గేమ్స్‌ను నిషేధిస్తూ ఈ బిల్లును రూపొందించారు. అయితే ఈ బిల్లు ద్వారా ఈస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌ను మాత్రం ప్రమోట్ చేస్తున్నారు. విపక్ష సభ్యులు ఇచ్చిన సవరణలను తోసిపుచ్చుతూ.. ఇవాళ రాజ్యసభలో ఆ బిల్లుకు ఆమోదం దక్కింది. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు బుధవారం లోక్‌సభలో క్లియరెన్స్ దక్కిన 2 లో..

### మౌన దివ్యాంగులకు ఏపీ
# సర్కార్ కీలక సహాయం



మన గళం, అమరావతి : ఏపీ సర్కార్ శ్రవణ, మౌన దివ్యాంగులకు ఒక కీలక సహాయం అందించబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా అర్హత గల వారికి ఉచితంగా టచ్‌స్క్రీన్ మొబైల్ ఫోన్లు అందజేయనున్నట్టు ప్రత్యేక ప్రతిభావంతుల విభాగం అధికారి ఎ.డి.వి. కామరాజు ప్రకటించారు. అర్హతల విషయానికి వస్తే కనీసం 18 సంవత్సరాల వయస్సు ఉండాలి. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు కావాలి. సైన్ లాంగ్వేజ్‌లో ప్రావీణ్యం ఉండాలి. కనీసం 40% పైబడిన వైకల్యం ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షల లోపుగా ఉండాలి. ఆసక్తి గల వారు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అప్లై చేసుకోవాలి. 2 లో..




### రేషన్‌కార్డుదారులకు
# గుడ్‌న్యూస్

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ బియ్యం ఇకపై స్మార్ట్‌గా జరగనుంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఇకపై రేషన్ బియ్యం ఇచ్చేందుకు స్మార్ట్ ఈ-పోస్ మిషన్లు అందించనున్నారు. మారుతున్న ట్రెండ్ టెక్నాలజీకి అనుగుణంగా మరింత వేగంగా సులభతరంగా ప్రజలకు రేషన్ తోపాటు నిత్యావసర సరుకులు అందించేందుకు చర్యలు 2 లో..

### ఏపీ వైసీపీ కీలక
# నిర్ణయం



- ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఆ కూటమికే మద్దతు
- ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

మన గళం, అమరావతి : ఉప రాష్ట్రపతి ఎన్నికపై వైసీపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్డీయే ప్రతిపాదించిన అభ్యర్థి రాధాకృష్ణన్‌కే తమ మద్దతు ఉంటుందని వైసీపీకి చెందిన కీలక నాయకుడు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ 2 లో..

# బీఎస్ఎన్ఎల్ ట్రిపుల ధమాకా

**– కేవలం రూ.400 లకే ట్రిపుల్ ప్లే సర్వీసులు**
**– హై స్పీడ్ ఇంటర్నెట్ ,**
**400కు పైగా టీవీ ఛానళ్లు , 9 ఓటీటీ లు మరియు అపరిమితమైన వాయిస్ కాలింగ్ .**




మనగళం, కర్నూలు సిటీ : స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా భారత ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల కోసం ఒకే ప్లాన్ ద్వారా హై స్పీడ్ ఇంటర్నెట్, టీవీ ఛానల్ లు, ఓ టీ టీలు, వాయిస్ టెలిఫోన్ సేవలను అతి తక్కువ అందుబాటు ధరల్లో అందించడానికి కొత్తగా ట్రిపుల్ ప్లే సర్వీసులను ప్రారంభించిందని బీఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ రమేష్ తెలిపారు. గురువారం స్థానిక బీఎస్ఎన్ఎల్ భవన్ కార్యాలయం నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ట్రిపుల్ ప్లే సర్వీసుల ద్వారా వినియోగదారులు నెలకు కేవలం 400 రూపాయలు చెల్లించి హై స్పీడ్ ఇంటర్నెట్ బీ ఈటీవీ ,మా టీవీ, జెమినీ టీవీ, జీ టీవీ లాంటి మరెన్నో ప్రముఖ ఛానల్లతో సహా 400కు పైగా టీవీ ఛానళ్లు, 9 ఓటిటి అప్లికేషన్లు భారతదేశమంతటికి అపరిమితమైన వాయిస్ కాల్స్ చేసుకునే సౌకర్యాలను ఆస్వాదించవచ్చని తెలిపారు. ఈ ప్లాను కర్నూలు బిజినెస్ ఏరియా లోని కర్నూలు, నంద్యాల జిల్లాలోని అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాలలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ ప్లాన్ ను నమోదు చేసుకోవడానికి 1800 4444 కు వాట్సాప్ ద్వారా హాయ్ ( %ఎఱ%) అని మెసేజ్ పంపడం ద్వారా కానీ లేదా సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లను సంప్రదించాలన్నారు.

అదనంగా, ఇప్పటికే ఉన్న బీఎస్ఎన్ఎల్ ఎఫ్ టి టి హెచ్ కస్టమర్లు కేవలం 140 రూపాయలతో రీఛార్జ్ చేసుకోవడం ద్వారా టీవీ సేవలను పొందవచ్చని తెలిపారు. కొత్తగా ఫైబర్ రూబీ ఓటిటి ప్లాను తీసుకునే వారికి నెల చందా ( 4799 ) లో నెలకు రూ.1000 డిస్కౌంట్ ఆరు నెలల వరకు ఉంటుందన్నారు. ఆగస్టు 15 నుండి సెప్టెంబర్ 13 వ తేదీ వరకు ఈ ప్లాన్ తీసుకునే వినియోగదారులకు ఈ ఆఫర్ వర్తిస్తుందని వివరించారు.

కేవలం రూ.1/- కే ఫ్రీడమ్ ప్లాన్

– 30 రోజులు పాటు ప్రతిరోజు 2 జిబి డేటా, అపరిమితమైన కాల్స్, 100 ఎస్ఎంఎస్ లు,ఉచిత సిమ్

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆత్మనిర్భర భారత్ లో భాగంగా బిఎస్ఎన్ఎల్ పూర్తి స్వదేశీ సాంకేతికతతో 4జి సేవలను దేశవ్యాప్తంగా ప్రారంభించిందని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి రమేష్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం మాసం ఆగస్టు నెలలో బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ఆఫర్ ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ నెలలో ఎవరైనా కొత్త సిమ్ ను బీఎస్ఎన్ఎల్ నుండి పూర్తి ఉచితంగా పొంది కేవలం రూ 1/- రీఛార్జ్ తో, 30 రోజులపాటు ప్రతిరోజు 2 జిబి డేటా, అపరిమితమైన కాల్స్, 100 ఎస్ఎంఎస్ లు పొందవచ్చన్నారు. ఇతర ఆపరేటర్ నుండి బీఎస్ఎన్ఎల్ కు పోర్ట్ అయిన వారికి కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ తో కలిసి బిజినెస్ చేయడానికి ఉపాధి అవకాశాలు

లోకల్ కేబుల్ ఆపరేటర్స్ ఎల్ సి ఓ లకు, మల్టిపుల్ సర్వీస్ ఆపరేటర్స్ ఎంఎస్ఓ లకు 50% కమిషన్ తో బీఎస్ఎన్ఎల్ నెట్వర్క్ ద్వారా ఇంటర్నెట్ మరియు టీవీ సేవలు కస్టమర్లకు అందించడానికి ఉపాధి అవకాశాలు ఉన్నాయని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి రమేష్ తెలిపారు. వివరాల కోసం పార్ట్నర్ సపోర్ట్ గ్రూప్ ఎస్ డి ఈ శ్రీ జానకిరామ్ ను మొబైల్ నెంబరు 9422464999 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ డీజీఎం కె రాజేశ్వరరావు, ఐఎఫ్ఏ డి. శ్రీలత, ఏజీఎం/ డివిజనల్ ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఈ క్రాప్ బుకింగ్ ను వేగవంతం చేయండి

**– రైతులు నానో యూరియాను వాడండి**
**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**




మనగళం, కర్నూలు సిటీ : ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కృష్ణగిరి మండల కేంద్రంలోని ఆముదం పంటను కలెక్టర్ పరిశీలించారు. ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆముదం పంట పండిస్తున్న రైతు మధు తో మాట్లాడారు. ఆముదం పంటకు ఎకరానికి ఎంత పెట్టుబడి పెడుతున్నారు ? ఎంత లాభం వస్తుందని ఆరా తీశారు. ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు ఈ క్రాప్ బుకింగ్ చేశారని కలెక్టర్ వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో పంట నష్టం ఎన్యూమరేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. యూరియా కి సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు భూసార సంరక్షణకు వీలుగా నానో యూరియాను వాడాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించండి: జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించి, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్న రైతు బ్రహ్మానందరెడ్డి పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎన్ని ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటడానికి సంవత్సరానికి రైతులకు ప్రభుత్వం హెక్టార్ కు 5 వేల 250 రూపాయల సబ్సిడీ ఇవ్వడంతో పాటు అంతర పంటలు వేసుకునేందుకు రూ. 5 వేల 250 రూపాయలు మంజూరు చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ ను పరిశీలించిన కలెక్టర్ :హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 68 చెరువులకు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో నీరు అందించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ సమీపంలో ఉన్న ఒక రైతు పొలం నుండి పైప్ లైన్ వేసినట్లయితే 200 ఎకరాల పొలం సాగులోకి వస్తుందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఈ అంశాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ ని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ పాండురంగయ్య , జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ ప్రసాద్, ఎంపిడిఓ మోహన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ నరేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**– పదవ తరగతి ఉన్నత విద్యకు పునాది**
**– విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి**
**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**





మనగళం, కర్నూలు సిటీ : పదవ తరగతిలో ఉత్తీర్ణత ఉన్నత విద్యకు పునాది అని, విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.

గురువారం కృష్ణగిరి మండల కేంద్రం లోని ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ముందుగా టీచర్లతో సమావేశం అయ్యారు. బోధన ఎలా చేస్తున్నారు, ఎంత మంది ఉపాధ్యాయులున్నారు అని ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికను పరిశీలించారు. 21 మంది సిబ్బంది ఉన్నారని, కంప్యూటర్ టీచర్, లైబ్రేరియన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్ట్ లు ఖాళీ గా ఉన్నాయని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ పోస్టులను భర్తీకి ఉన్నతాధికారులకు పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ డీఈఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కలెక్టర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు రుచిగా, శుచిగా భోజనం అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిర్మలా కుమారి, ఎం ఈ వో మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

మనగళం, కర్నూలు సిటీ : సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రం కృష్ణగిరి లోని గ్రామ సచివాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది హాజరు తో పాటు వారు నిర్వర్తిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలను త్వరితగతిన అందించాలని, అలసత్వం వహించకూడదన్నారు. ప్రతి రోజు సేవలకు సంబంధించి ఎన్ని గ్రీవెన్స్ లు వస్తున్నాయని, ఇప్పటివరకు ఈ క్రాప్ బుకింగ్ ఎంత మేరకు పూర్తి చేశారని కలెక్టర్ సచివాలయం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఎంపిడిఓ మోహన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నలను కాపాడుకుందాం


– జనతా ఫౌండేషన్ అధినేత సత్యం

మనగళం, కర్నూలు సిటీ : పొద్దు పొద్దున్నే లేచి పోగులను పోగుచేసి సంఘంలో గౌరవాన్ని నిలబెట్టే నేతన్నలను కాపాడుకుందాం అని జనతా ఫౌండేషన్ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్తా కోరారు. గురువారం ఆయన ప్రెస్ క్లబ్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ నేసిన నేత తాళ్ళకు ఉరి వేసుకునే దుస్థితి రాకూడదన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు ఒకవైపు మరోవైపు నేతన్నలను, రైతులను, కార్మికులను కాపాడుకునే విధానాల్లో వెళ్లాలని ఆయన సూచించారు. ఈనాటికీ నేతన్నలు చేనేత దుస్తులు చేసేందుకు సాహసించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక కుటుంబాలలో వారి పిల్లలకు వివాహాలు కూడా చేయలేక భార్య బిడ్డలను వదిలేసి వెళ్లిపోయిన సంఘటనలో ఎన్నో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు కూడా చేనేత దుస్తులను కొనుగోలు చేసేందుకు సిద్ధపడాలని, నేతన్నల సంక్షేమానికి సహకరించాలని ఆయన కోరారు. ప్రతి ఉద్యోగి, ప్రతి విద్యార్థి వారంలో కనీసం రెండు రోజుల చేనేత దుస్తులను ధరించాలని కోరారు. ఎంతో ఖరీదు పెట్టుకొని ఇళ్ళను నిర్మిస్తాం, సెల్ఫోన్లను కొనుగోలు చేస్తాం కానీ నేతన్నల దుస్తులు ధరించడానికి ఎందుకు సాహసించడం లేదని ఆయన ప్రశ్నించారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మిగనూరులో దీక్ష చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆ దీక్ష ఫలితమే ఆనాడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి రెండు జతల దుస్తులు ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. ప్రైవేట్ రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఈనాడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కనీసం 50 శాతం ప్రభుత్వం భరించి 50 శాతం తల్లిదండ్రులు భరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఉచిత పథకాలు ముఖ్యం కాదని రేపటి తరానికి అప్పుల భారం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలకు ఉండాలని కోరారు. వారంలో కనీసం రెండు రోజులు ప్రతి వార్డులో కూడా చేనేత బజార్లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆప్కో రంగంను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు, ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో ఆరుగురు విద్యార్థులు నీటి కుంటలో పడి మృతి చెందడం తీవ్ర ఆవేదన కలిగించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్నచిన్నారులు నీటి కుంటలో మునిగి మృతి చెందడం ఆ కుటుంబాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఒక్కొక్క కుటుంబానికి రూ. 50 లక్షలు అందజేసి ఆదుకోవాలని కోరారు.

# ఆర్టీసీ కార్మికుల పెన్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు




మనగళం, కర్నూలు సిటీ : ఆర్టీసీ కార్మికుల పెన్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని టీఎన్ టీయూసీ గౌరవాధ్యక్షులు, డీసీఎంఎస్ అధ్యక్షులు వై. నాగేశ్వర రావు యాదవ్ హామీ ఇచ్చారు. కర్నూలులో గురువారం నిర్వహించిన పాత పెన్షన్ స్కీం సాధన సమితి సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో విలీనం అయినా ఆర్టీసీ కార్మికులు ఆశించిన పాత పెన్షన్ పథకం అమలు చేయలేదని, సీఎం చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. ఆర్టీసీలో రిటైర్డ్ అయిన కార్మికులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక పెన్షన్ రూ. 4000 కంటే తక్కువగా వస్తుందని, న్యాయం చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్ డబ్ల్యూ ఎఫ్ )రాష్ట్ర కోశాధికారి జె .దివాకర్ మాట్లాడుతూ పెన్షన్ చట్టబద్ధమైన హక్కు అని, అయితే ఉద్యోగ కార్మికులకు పాత పెన్షన్ అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ల పేరుతో కార్మికుల సొమ్మును దోచుకుంటున్నాయని విమర్శించారు. ఈపీఎస్ 95 పథకంలోని హయ్యర్ పెన్షన్ సమస్యలతో ఆర్టీసీ కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, సుప్రీంకోర్టు తీర్పును కూడా సక్రమంగా అమలు చేయడానికి ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏ.వీ. రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా లేకపోయినా రాజస్థాన్, హిమచల ప్రదేశ్, పంజాబ్, ఝార?ండ్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగానే మన రాష్ట్రంలో కూడా పాత పెన్షన్ ఆర్టీసీ కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్. ఆర్. నాయుడు మాట్లాడుతూ విలీనం సందర్భంగా ఆశించిన పాత పెన్షన్ ఆశ నెరవేరకపోగా కొత్తగా అనేక సమస్యలను కార్మికులను ఎదుర్కొంటున్నారని, ఉద్యమానికి తమ మద్దతు ఉంటుందన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈపీఎఫ్ఓ రిటైర్డ్ కార్మికులను అనేక ఇబ్బందులకు గురిచేసిందని, తక్కువగా పెన్షన్ వస్తున్న ఉద్యోగ కార్మికులందరికీ రేషన్ కార్డులు ఇచ్చి సామాజిక పెన్షన్ అందజేయాలని కోరారు. ఆర్టీసీ రిటైర్డ్ అసోసియేషన్ జిల్లా నాయకులు ఎస్.ఎస్. రావు మాట్లాడుతూ రిటైర్డ్ కార్మికులను ఉచిత ప్రయాణానికి సూపర్ లగ్జరీ సర్వీసులలో కూడా అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ టీఎన్ టీయూసీ జిల్లా నాయకులు కె. జె.ఎం. రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెన్షన్ పట్ల సానుకూలమైన వైఖరిని తీసుకొని పరిష్కరించాలని కోరారు. ఆర్టీసీ టీఎన్ టీయూసీ నాయకులు చంద్రమోహన్ మాట్లాడుతూ ఆర్టీసీ పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని కోరారు. ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జిల్లా నాయకులు పీవీ కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు పొందుతున్న అన్యాయమైన పెన్షన్ కు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో భాగస్వాములమవుతామని చెప్పారు.

# ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




మనగళం, కర్నూలు సిటీ : ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆర్థికంగా ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, ఏపీ ఆటో వర్కర్స్ అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు అధ్యక్షతన ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత విద్యనభ్యశించిన నిరుద్యోగులు ప్రైవేట్ వ్యక్తులు, బ్యాంకుల్లో లోన్ తీసుకుని కుంటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 30 వేల కుటుంబాలు ఆటోల ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నాయన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిందని, ఆటో డ్రైవర్లకు బాడుగలు తగ్గినాయని, ఉపాధి దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద సంవత్సరానికి 25,000 ఇచ్చి ఆదుకోవాలని కోరారు. 2019లో గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు చైన్ సింగ్, నాగరాజు, ఓబులేసు, నాగేంద్ర, సురేష్,గంగయ్య,బాలు, స్వామన్న, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి




మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలో పది రోజులపాటు కురిసిన వర్షాల వల్ల 9 మండలాల్లో దాదాపు 25 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, అలాంటి రైతులకు ఎకరాకు 30 వేల రూపాయలు ఆర్థిక సహకారం ప్రభుత్వం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి ప్రభుత్వాన్ని కోరారు. ఈరోజు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సీపీఎం బృందం వర్షాల వల్ల నష్టపోయిన పంటలను జిల్లాలో పరిశీలించడం జరిగిందని, దాదాపు 25 వేల ఎకరాల్లో పంట నష్టపరిహారం జరిగిందని తెలిపారు. ప్రధానంగా పత్తి పంట మొదటి కాపు మొత్తం భూమిలో రాలిపోయిందని, కొన్ని చోట్ల మొత్తం పంట అంతా దెబ్బతిన్నాదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలో వేరుశనగ మొక్కజొన్న, టమోటా, పచ్చిమిర్చి, ఉల్లి పంటలు దెబ్బతిన్నాయన్నారు. పెద్దకడబూరు మండలం పులికన గ్రామంలో 24 హెక్టార్ల లో పంట నష్టం జరిగిందని, ఆ ఊరిలో ప్రజలు ఖాళీ చేతులతో నిలిచిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశాడు . ఆస్పరి మండలం వలిగొండ గ్రామం ఈ వర్షాల వల్ల మొత్తం మునిగిపోయిందని, పక్కలోనే వంక ఉండడంతో రాకపోకలు దాదాపు రెండు రోజులపాటు లేని పరిస్థితి ఉందని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే వలగొండ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, టి రాముడు మాట్లాడుతూ ఆదోని వ్యవసాయ మార్కెట్లో అధిక వర్షాల వల్ల వందల క్వింటాళ్ల వేరుశనగ నీటిపాలయిందని, రైతుల గోడు వర్ణనాతీతంగా ఉందన్నారు. ఆదోని మార్కెట్లో షెడ్లను తగిన సంఖ్యలో నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

## సాంస్కృతిక కార్యక్రమాలు




మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు (21.08.2025) శ్రీ సూర్య కళాకల్చరల్ అకాడమి, కర్నూలు వారిచే భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గణపతి ప్రార్థన, గణనాథం భజే, శంభో మహాదేవ, భో... శంభో, నమశ్శివాయతే, శివ శివ శంకరా, నటరాజస్వామి మరియు పలు శివకీర్తనలను గీతాంజలి, శివరేవంత్రెడ్డి, గీతాశ్రీ, హర్ష జయ, జయంత్ తదితరులు ఆలాపిస్తున్నారు. వయోలిన్ సహకారాన్ని ఈ కార్యక్రమానికి మృదంగ సహకారాన్ని సుధాకర్, బి. రమణయ్య, ఘటం సహకారాన్ని బి.కె. ఎస్. చరణ్ అందిస్తున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీ స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన కళల పరిరక్షణలో భాగంగా కార్యక్రమాలు సంప్రదాయ నిత్యకళారాధన నిర్వహించబడుతున్నాయి.

# చనిపోయిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి



మనగళం, కర్నూలు టౌన్ : ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలం చిగలి గ్రామంలో ఐదవ తరగతి చదువుతున్న ఐదు మంది విద్యార్థులు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మరణించడం చాలా బాధాకరమని మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు విచారం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల కడుపు కోత తీర్చలేనిదని, బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆర్థిక సహాయంతోపాటు రెండు ఎకరాల భూమి, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఎన్ సీ బజారన్న, ఐ ఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- విగ్రహాల అనుమతులకు పోలీసుస్టేషన్ లకు రావలిసిన అవసరం లేదు
- వెబ్సైట్ లో వివరాలు పొందుపరిస్తే పోలీసులు పరిశీలించి అనుమతులు మంజూరు
- ట్రాఫిక్ అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలి
- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్





మనగళం, కర్నూలు క్రైం : గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైల తో జిల్లా ఎస్పీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులపై ఎస్పీ చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాట్సప్, మెయిల్ ఐడీ, రిజష్టర్ పోస్టు ద్వారా పోలీసులకు ఫిర్యాదులు వచ్చినప్పుడు తీవ్రమైనవి అయితే విచారించి కేసుల నమోదుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హైకోర్టు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలు తగ్గించే విధంగా డిజిటల్ సైన్ బోర్డ్సు, హెూర్డింగ్స్ వంటి చర్యలు చేపట్టాలన్నారు. రౌడీ షీటర్స్ ను , కిరాయి హంతకుల ను ప్రతి ఆదివారం పోలీసుస్టేషన్ లలో కౌన్సిలింగ్ చేయాలని, కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. గత మూడు నెలలో పోలీసుస్టేషన్ లలో కౌన్సిలింగ్ కు హాజరవ్వని రౌడీషీటర్ల వివరాలను ఖచ్చితంగా ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కార్డన్ సెర్చ్ లు, నాకా బందిలు, వాహనాల తనిఖీలు తరుచుగా ఖచ్చితంగా చేయాలన్నారు. శాంతిభద్రతలకు , తీవ్రమైన నేరాలకు పాల్పడే హిస్టరీ షీట్స్ ఉన్న వారిని జిల్లా బహిష్కరణ కోసం పీడీ యాక్టులు సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినాయక విగ్రహాల అనుమతులకు నిర్వహకులు పోలీసుస్టేషన్ లకు రావాల్సిన అవసరం లేదని, వెబ్సైట్ లో వివరాలు పొందుపరిస్తే స్థానిక పోలీసులు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని చెప్పారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసులు సూచనలు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ఎలాంటి రుసుములూ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. విగ్రహా నిర్వహకులైన దరఖాస్తుదారులు వారి చిరునామా, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, కమిటీ సభ్యుల ఫోన్ నంబర్లు, నిమజ్జనం తేదీ, సమయం, విగ్రహాన్ని ఏ వాహనంలో తీసుకెళ్తారనే వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ వివరాల మేరకు స్థానిక పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న మండపాలకు అనుమతులిస్తారన్నారు. పోలీసులు జారీ చేసే క్యూఆర్ కోడ్ పత్రాన్ని విగ్రహ నిర్వహకులైన దరఖాస్తుదారులు నేరుగా ఈ వెబ్ సైట్ నుంచే డౌన్లోడ్ చేసుకోని వినాయక విగ్రహాల దగ్గర ఉంచుకోవాలన్నారు. గస్తీ తిరిగే పోలీసు అధికారులు , పోలీసులు విగ్రహం కు ఉన్న క్యూఆర్ కోడ్ ను తనిఖీలు చేస్తారన్నారు. మండపాల దగ్గర విగ్రహ నిర్వహకులు సీసీ టీవీలు ఏర్పాటు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తి పాటలు ఉదయం 6 నుండి రాత్రి 10 వరకు మాత్రమే అనుమతి ఉంటుందని, పెద్ద శబ్ధాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదని హెచ్చరించారు. కర్నూలులో సెప్టెంబర్ 4 న నిమజ్జనం ఉంటుందని, ప్రణాలికా బద్ధంగా బందోబస్తులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. నేర సమీక్ష వేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, హేమలత , భార్గవి, సీఐలు , ఎస్సైలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల పెన్షన్లలో దిగజారుడు తనమేంటి ?

- ఎంక్వయిరీ పేరుతో ఎత్తివేతకు పాల్పడితే ఊరుకోం



మనగళం, కర్నూలు సిటీ : దివ్యాంగుల పెన్షన్లలో దిగజారుడు తనమేంటి.... ఎంక్వయిరీ పేరుతో ఎత్తివేతకు పాల్పడితే ఊరుకోం అని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు, ఎన్ పి ఆర్ డి జిల్లా కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షులు రాధ, దివ్యాంగుల సాధికార ఫోరం అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, శివశంకర్, ఉపాధ్యక్షులు వెంకటేష్, డి ఆర్ డబ్ల్యు ఎఫ్ నాయకులు మస్తాన్ వలి, వికలాంగుల ఆదరణ సేవా సమితి నాయకులు మరియదాసు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, గురు శేఖర్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు నాగ సుంకన్న హెచ్చరించారు. కర్నూల్ నగరంలోని కార్మిక కర్షక భవన్ వద్ద ఉన్న రజక సంఘం జిల్లా కార్యాలయంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షురాలు రాజామనెమ్మ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఎంక్వయిరీ పేరుతో ఏరివేత ప్రోగ్రాంకు రాష్ట్ర ప్రభుత్వం స్వీకారం చుట్టిందని, తప్పుడు సర్టిఫికెట్లు పొందిన వాళ్లను తీసేస్తే మాకు ఏమీ ఇబ్బంది లేదని, అయితే ఎలాంటి విచారణ లేకుండానే 90 శాతం వికలాంగత్వం కలిగిన వాళ్లకు సైతం 40 శాతం వికలాంగత్వం ఉన్నట్లుగా సర్టిఫికెట్ జారీ చేయడం అంటేనే వాళ్లను సంపూర్ణంగా సంక్షేమ పథకాలకు దూరం చేయడమే అన్నారు. 40 రకాలుగా ఉన్న వికలాంగులమంతా ఐక్యమై పెన్షన్ల రక్షణ కోసం సంక్షేమ పథకాల సాధన కోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, ప్రతి ఒక్కరూ పాల్గొని సహకరించాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నాయకులు నబి రసూల్, మౌలాలి, పాల్గొన్నారు.

# అస్మిత రగ్బీ లీగ్ పోటీలను ప్రారంభించిన టీజీ వెంకటేష్



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన అస్మిత రగ్బీ లీగ్ పోటీలను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలకు తమ పాఠశాల క్రీడామైదానాన్ని కేటాయించిన ఆదర్శ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్ ను అభినందించారు. జిల్లాకు నూతనంగా పరిచయమైన రగ్బీ క్రీడలో క్రీడాకారులు క్రమశిక్షణ, అంకితభావంతో సాధన చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. నూతన క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరచడం వల్ల ఉన్నత స్థాయికి చేరే అవకాశాలు మెండుగా ఉంటాయని ఆయన చెప్పారు. నూతనంగా వచ్చిన క్రీడల్లో సహజంగానే పోటీ తక్కువగా ఉంటుందని, దీనివల్ల క్రీడాకారులు తమ ప్రతిభను చాటేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం నూతన క్రీడ అయిన రగ్బీ రానున్న రోజుల్లో మరింత ప్రాచుర్యం పొంది పోటీ అధికమయ్యే అవకాశం ఉందని టీజీ చెప్పారు. అనంతరం ఆదర్శ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, రగ్బీ క్రీడా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు సురేంద్ర తదితరులు మాట్లాడుతూ కర్నూలు నగరంలో క్రీడలను ప్రోత్సహించడంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అందిస్తున్న సహకారం మరువలేనిదని చెప్పారు. వారి సహకారం వల్లే రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కర్నూల్ నగరంలో క్రీడలు అభివృద్ధి చెందుతున్నాయని వివరించారు. అనంతరం టీజీ వెంకటేష్ కు శాలువా కప్పి మెమెంటో అందజేసి సన్మానించారు.

శుక్రవారం
22 - 08 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

ఏఐ..సమస్యనా? పరిష్కారమా?

'చాట్ జీపీటీలో అడిగే ప్రతి ప్రశ్నకు ఒక చుక్క నీరు ఖర్చవుతుంది'.. ఇటీవల ఒక సమావేశంలో ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్ మాన్ చెప్పిన మాటలివి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజు చాట్ జీపీటీకి 2.5 బిలియన్లు.. అంటే 250 కోట్ల క్వరీస్ వస్తాయి. ఈ లెక్కన తీసు కున్నా.. ప్రతి రోజు లక్షల లీటర్ల నీరు ఒక్క చాట్ జీపీటీ వంటి ఏఐకు అవసరం. అయితే ఇది సామ్ ఆల్ట్ మాన్ చెప్పిన అతి తక్కువ లెక్క మాత్రమే. దీనికి పది రెట్లు ఎక్కువ నీరు ఖర్చవుతుందని ఒక అంచనా. ఈ ప్రకారం చూసుకున్నా.. ఏఐ వల్ల మనుషుల ఉద్యోగం, ఉపాధి మీద ప్రభావం పడడమే కాదు.. భూమిపై పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతున్నది. గ్లోబల్ వార్మింగ్ కు ఇది కారణమవుతున్నది. అయితే ఏఐ వల్ల నష్టాలను పక్కనపెడితే.. శాస్త్ర, సాంకేతిక, వైద్య, విద్య, వాతావరణ మార్పుల అంచనా, ఖగోళ పరిశోధన రంగాలు ఏఐ వల్ల దూసుకుపోతున్నాయి. క్యాన్సర్ వంటి రోగాలు పూర్తిస్థాయిలో నయమయ్యేలా సమీప భవిష్యత్తులో వ్యాక్సిన్, మందులు ఏఐ వల్ల సాధ్యమయ్యే అవకాశాలున్నాయి. విద్యారంగంలోనూ సమూల మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ నేపథ్యంలో అనేకసమస్యలకు, రోగాలకు పరిష్కారమార్గాలు చూపుతున్న ఏఐ.. తన వల్ల ఏర్పడుతున్న పర్యావరణ సమస్యకు కూడా పరిష్కారం వెతికే ప్రయత్నం చేయాలి. ఆయా కంపెనీలు ముందుగా అటువైపు దృష్టిసారించాలి. ఏఐ వెనక ఊహించని విధ్వంసం జరుగుతున్నదని అనేక మంది పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా చాట్ జీపీటీ (ఓపెన్ ఏఐ), గ్రోక్ (ఎక్స్), జెమినీ (గూగుల్), డీప్ సీక్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), మెటా, ఎన్విడియా, ఇంటెల్, సిస్కో, ఎక్స్ వంటి కంపెనీలు ఏఐని అభివఅద్ధి చేస్తూ వినియోగంలోకి తీసుకువస్తున్నాయి. ఇంకా అనేక కంపెనీలు ఈ రంగంలో తమ సత్తా చాటుకునేందుకు ప్రయత్ని స్తున్నాయి. అయితే ఏఐ కోసం ఇలాంటి కంపెనీలకు డేటా సెంటర్లు అత్యంత ప్రాముఖ్యం కలిగి ఉంటాయి. ఏఐ విస్తృత వినియోగం వల్ల ఈ డేటా సెంటర్లలో ఉండే సర్వర్లు, సూపర్ కంప్యూటర్లు నిరంతరం వేడెక్కుతాయి. వీటిని చల్లబర్చ డానికి ప్రతి రోజు కోట్లలీటర్ల నీరు అవసరమవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు ప్రస్తుతం 560 బిలియన్ లీటర్ల నీటిని వినియో గిస్తున్నాయి. సమీప భవిష్యత్తులో ఇది 1200 బిలియన్ లీటర్లకు పెరగవచ్చు. ఒక సాధారణ డేటా సెంటర్ రోజుకు 5 మిలియన్ గ్యాలన్ల నీటిని వాడుతుంది. ఇది 10వేల నుండి 50వేల మంది నివసించే ఒక పట్టణ ప్రజల నీటి వినియోగానికి సమానం. 2027 నాటికి ఏఐ కోసం 6.6 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు అవసరమవుతుందని అంచనా. గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా కంపెనీలు 2022లోనే 580 బిలియన్ గ్యాలన్ల నీటిని వాడాయి. ఈ నేపథ్యంలో ఏఐ కంపెనీలు వినియోగించే డేటా సెంటర్లు ఉన్న అమెరికా, ఐరోపా, సింగపూర్, సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాల్లో నీటి కొరత ఏర్పడుతున్నట్లు తెలుస్తున్నది. ఏఐకి నీటి కేటాయింపులు చేస్తుండడంతో స్థానిక ప్రజల తాగునీరు, వ్యవసాయ అవసరాలకు కేటాయింపులు తగ్గుతున్నా యనే విమర్శలు వస్తున్నాయి. ఓపెన్ ఏఐ లాంటి సంస్థలు లాంగ్ ఏఐ మోడల్స్ శిక్షణ కోసం వేలకొద్దీ గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో విపరీత మైన విద్యుత్ ఖర్చవుతుంది. 2023లో యూఎస్ లోని డేటా సెంటర్లు ఆ దేశ వినియోగంలో ఉన్న విద్యుత్ లో 4.4శాతం కరెంట్ ను వాడాయి. 2028 నాటికి ఇది పన్నెండు శాతానికి పెరిగే అవకాశముంది. అయితే ఆ విద్యుత్ ఉత్పత్తి కోసం వినియోగించే బొగ్గు, ఇతర శిలాజ ఇంధనాల వల్ల వందల టన్నుల కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయి. ఏఐ కోసం వినియోగించే చిప్ ల వల్ల కూడా పర్యావరణానికి హాని ఏర్పడుతున్నది. చిప్‌ల తయారీ కోసం వేల గ్యాలన్ల శుద్ధి చేసిన నీరు అవసరం. అంతేకాకుండా సిలికాన్, బంగారం, ప్లాటినం వంటి ఖనిజాలను భూమి నుంచి వెలికి తీయడానికి భారీగా మైనింగ్ చేయాల్సి ఉంటుంది. దీనికోసం అడవులను నిర్మూ లిస్తున్నారు. భూమి సైతం కోతకు గురవుతున్నది. అంతేకాకుండా పాడైపోయాక ఆ చిప్‌లను పారేస్తుండడం వల్ల పర్యావరణానికి మరింత నష్టం జరుగుతున్నది. అనేక రంగాల్లోని క్లిష్టమైన సమస్యలకు పరిష్కార మార్గాలు వెతుకుతున్న ఏఐ.. ముందుగా తన వల్ల జరిగే పర్యావరణ హననానికి పరిష్కారాన్ని వెతకాలి. సౌర, పవన శక్తి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. తక్కువ శక్తిని వినియోగించే ఏఐ అల్గారిథమ్స్‌ను రూపొందించు కోవాలి. తమ కంపెనీల వల్ల కలిగే పర్యావరణ ప్రభావాన్ని ముందుగా ఈ కంపెనీలు ప్రజలకు వివరించాలి. ప్రజలు కూడా ఏఐ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. అనవసర ప్రశ్నలకు, ఏఐలో హలో, హాయ్, ధన్యవాదాలు వంటి పదాలకు దూరంగా ఉండాలి. ఏఐ వల్ల అనేక సమస్యలకు పరిష్కారాలు దొరుకుతున్నాయనుకొని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. ప్రపంచం ముందు పర్యావరణానికి సంబంధించి మరో పెద్ద సమస్య ఏర్పడే ప్రమాదముంది.

## పాత ప్రభుత్వ ఆసుపత్రిలోఅర్బన్ హెల్త్ సెంటర్ మరియు రైతు బజార్ ఏర్పాటు ఎమ్మెల్యే కోట్ల





మన గళండోన్ పట్టణంలోని పాతపేటలో ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ఆ ప్రాంగణంలో రైతు బజార్ మరియు అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే నెల రెండో వారంలోపు పై పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుని, అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవానికి సన్నద్ధం కావాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే ఫ్లైఓవర్ నుంచి పాతపేటలోకి వాహనాల రాకపోకలు సులభతరం కావడానికి ప్రత్యేక ర్యాంపు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మరింత సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.మరియు పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించిన శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఆహారం వండుతున్న విధానం, శు భ్రత, విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం యొక్క రుచి మరియు నాణ్యతపై ఎమ్మెల్యే ప్రత్యక్షంగా ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భోజనం నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా, విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు అధికారులను, సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## ఘనంగా పార్వతమ్మ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం





మనగళం నెట్ వర్క్ : విజయవాడ,గొల్లపూడి లోని బీసీ సంక్షేమ భవన్ లో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా కె.పార్వతమ్మ పదవీ ప్రమాణస్వీకారం కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, టీటీడీ బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, తెలంగాణ మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ మధుసూదన్ ఆచారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి తదితరులు పార్వతమ్మకు అభినందనలు తెలిపారు.

## యూరియా పంపిణీ లో అక్రమాలు జరగకూడదు

మనగళం, వెల్దుర్తి : జిల్లాలో యూరియా పంపిణీ లో అక్రమాలు జరగకూడదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రం లో రైతులకు యూరియా పంపిణీని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ యూరియా పంపిణీ రికార్డులను పరిశీలించారు. గ్రామానికి ఇప్పటి వరకు ఎంత యూరియా వచ్చింది, రైతులకు ఎలా పంపిణీ చేశారు అని ఆరా తీశారు. ఇంకా ఎంత మేరకు యూరియా అవసరం ఉందని కలెక్టర్ మండల వ్యవసాయ అధికారిని అడిగారు. 300 బ్యాగ్ ల యూరియా ఈ గ్రామానికి అవసరం ఉందని మండల వ్యవసాయ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా , తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీటీసీల గెలుపు ప్రజాస్వామ్యం విజయం




మనగళం నెట్ వర్క్ : పులివెందుల, ఒంటిమిట్ట విజయం ప్రజాస్వామ్యం విజయం అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో విజయం సాధించిన లతారెడ్డి, కృష్ణారెడ్డిని సీఎం అభినందించారు. ఉండవల్లి నివాసంలో ఉమ్మడి కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సీఎం సమావేశం అయ్యారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని గెలిపించారని, ఇదే స్ఫూర్తి కొనసాగించాలని పిలుపునిచ్చారు.

## నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం

మనగళం, మైదుకూరు : నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో సభ్యులు గురువారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు అన్నం, పప్పు, పెరుగు, రసం, స్వీటుతోపాటు వాటర్ బాటిల్స్ అందించారు. యాచకులు, పేదలకు, సాధువులకు,నిరాశ్రయులకు,బాటసారుల ఆకలి తీర్చారు. దివంగత నడమల బాలసుబ్బారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు నడమల దామోదర్ రెడ్డి, అన్న ఆర్థిక సహకారంతో నేస్తం సేవా సంస్థ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పిప్పళ్ళ బాలనాగిరెడ్డి, వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హుల పింఛన్లు తొలగించడం అమానుషం - బుట్టా రేణుక



మనగలం..ఎమ్మిగనూరు : రాష్ట్రంలో జరుగుతున్న పింఛన్ల తొలగింపు దారుణమని ఎమ్మిగనూరు వైసీపీ ఇంచార్జ్ బుట్టా రేణుక ఆగ్రహం వ్యక్తం చేశారు.. గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో లో "కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కేవలం పింఛన్లు నిలిపివేయడం కాదు %-% నిరుపేదల కడుపులో అన్నం లాక్కోవడం, వృద్ధులు దివ్యాంగులను రోడ్డుపైకి తోసేయడం" అని మండిపడ్డారు. గత 14 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల పింఛన్లు రద్దు కావడం మానవత్వానికి విరుద్ధమని బుట్టా రేణుక అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయం సరిదిద్దాలని ఆమె డిమాండ్ చేశారు. పింఛన్లు పునరుద్ధరించకపోతే వైసీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఆందోళనలు తప్పవని బుట్టా రేణుక స్పష్టం చేశారు

## నీట్ పీజీ ఎంట్రెన్స్ లో ప్రతిభ చాటిన లక్ష్మి కీర్తన దేవి

మనగళం, అవుకు : నీట్ పీజీ ఎంట్రెన్స్ పరీక్షలలో నంద్యాల జిల్లా అవుకు గ్రామానికి చెందిన కుమ్మిత సంజీవ రెడ్డి కుమార్తె లక్ష్మి కీర్తన దేవి ప్రతిభ చాటారు. ఆల్ ఇండియాలో 1185 వ ర్యాంక్ సాధించిన సందర్భంగా లక్ష్మి కీర్తన దేవిని గురువారం దివంగత ఎమ్మెల్యే చల్లా రామక్రిష్ణారెడ్డి కుమారుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి సత్కరించారు. అవుకు పట్టణంలోని చల్లా కార్యాలయం నందు విద్యార్థినికి శాలువా కప్పి మెడల్ తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు, మన అవుకు గ్రామానికి దేశ స్థాయిలో మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చినందుకు గర్వంగా ఉందని చల్లా సంతోషం వ్యక్తం చేశారు.



# "ఉల్లాస్... అక్షరాంధ్ర"లో భాగస్వాములవ్వాలి

**– జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారెడ్డి**

మనగళం, నంద్యాల : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "ఉల్లాస్... అక్షరాంధ్ర" కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా నిర్వహించడంలో జిల్లా, మండల స్థాయి అధికారులందరూ భాగస్వాములవ్వాలని జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలోని పిజిఆర్ఎస్ హాలులో "ఉల్లాస్... అక్షరాంధ్ర" కార్యక్రమం పై జిల్లా స్థాయి ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ... రాష్ట్రవ్యాప్తంగా గతంలో జి ఎస్ డబ్ల్యూ ఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కాస్ట్ సర్వే ద్వారా నంద్యాల జిల్లాలో మొత్తం 3,02,050 మంది వయోజన నిరక్షరాసులు గుర్తించబడ్డారని తెలిపారు. మొదటి విడతలో 1,00,686 మందిని ఈ సంవత్సరంలో అక్షరాసులుగా మార్చేందుకు సంబంధిత శాఖల సహకారంతో యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే మూడేళ్లలో మొత్తం నిరక్షరాస్యులను అక్షరాసులుగా మార్చి, నంద్యాల జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత ఏడాది ఉల్లాస్ కార్యక్రమం కింద జిల్లాలోని 28 మండలాల్లో డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా 26,785 మందికి అక్షరాస్యత కల్పించామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న రెండో విడత కార్యక్రమంలో డి ఆర్ డి ఎ, డ్వామా, మెప్మా శాఖల ద్వారా 100686 మంది శిక్షణ మరియు బోధన ఇచ్చేలా ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఒక్కో వాలంటీర్ టీచర్‌కు 10 మంది లెర్నర్ల కేటాయింపు ఆగస్టు నుండి 2026 ఫిబ్రవరి




20 వరకు 100 గంటల తరగతులు రెండు ప్రాథమిక పుస్తకాలు, ఐదు మోడల్ పేపర్లు ఫైనాన్షియల్, డిజిటల్, ఫంక్షనల్, లీగల్ లిటరసీపై శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ పొందిన వారికి 2026 మార్చిలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ న్యూ ఢిల్లీ వారిచే ధ్రువ పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య ఉప సంచాలకులు చంద్రశేఖర్ రెడ్డి, డి ఆర్ డి ఏ పథకం సంచాలకులు శ్రీధర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, డ్వామా సంచాలకులు సూర్యనారాయణ, డి ఎల్ డి ఓ శివారెడ్డి, వయోజన విద్యాశాఖ నోడల్ అధికారి బీవీ భాస్కర్ రెడ్డి, వయోజన విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల వేతనాలు పెంచాలంటూ స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట సిఐటియు ధర్నా

మన గళం కోడుమూరు: కోడుమూరు అంగన్వాడీల వేతనాలు పెంచాలని కోడుమూరు తాసిల్దార్ ఆఫీస్ వద్ద అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడమైనది ఈ ధర్నా కు ప్రాజెక్టు నాయకురాలు శూలమ్మ అధ్యక్షతన జరిగింది సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు గఫూర్ మియా, జిపి వీరన్న ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి వేతనాలు పెంచలేదు మన రాష్ట్రంలో 2019 నుంచి వేతనాలు పెంచలేదు ఈ కాలంలో పని భారం పెరిగింది 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారు అయినా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం దాని గురించి పట్టించుకోవడం లేదు అంగన్వాడి నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదు పోశం ట్రాకర్ బాల సంజీవిని యాప్స్ అమలకు ఫోన్లు సపోర్ట్ చేయడం లేదు ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది అధికారులు లబ్ధిదారులకు ఫోటో క్యాప్చర్ ఓటిపి ఎఫ్ ఆర్ ఎస్యు ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయటానికి అంగన్వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు సరుకులు అన్నీ ఒక్కసారిగా రావడం లేదు నెట్ సిగ్నల్ లేకపోవడం సర్వర్లు పనిచేయకపోవడం లబ్ధిదారులందరూ ఇబ్బంది పడుతున్నారు కావున అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడి వర్కర్ గా మార్చుతూ జీవో ఇవ్వాలి యాపులన్నీ కలిపి ఒకే




యాపు గా మార్పు చేయాలి ఎఫ్ ఆర్ ఎస్ ను ఇన్ అవుట్ రద్దు చేయాలని సెంటర్ నిర్వహణకు ట్యాబులు ఇవ్వాలని ఫైవ్ జి నెట్ ఇవ్వాలి ప్రధానమంత్రి మాతృ వందన పథకం నీ కొత్తగా అంగన్వాడీలకు అప్పగించారు గ్రాట్యూటీ జీవో లో మార్పు చేయాలి హెల్పర్లు ప్రమోషన్లకు గైడ్లైన్స్ రూపొందించాలని కోరుతున్నాం వెంటనే అంగన్వాడీల యూనియన్స్ను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని వారన్నారు ఈ కార్యక్రమంలో సూలమ్మ. అరుణ. హైమావతి. రజియా. భాగ్యమ్మ నాగమ్మ పాల్గొన్నారు.

# కోడుమూరు మండలంలోని ఆమడగుంట్ల గ్రామంలో నూతన సచివాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలం పరిధిలోని ఆమడగుంట్ల గ్రామం నందు గురువారంకోడుమూరు ఎమ్మెల్యే శ్రీ బొగ్గుల దస్తగిరి, కేడిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన గ్రామ సచివాలయం ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వర లక్ష్మి , కోడుమూరు మండల కన్వీనర్ రామ కృష్ణ రెడ్డి , మండల కార్యదర్శి రాజు, పట్టే కృష్ణ, త్రివేద్, చిన్న బండ భాష, రామగిడ్డయ్య, అధికారులు, గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు

మనగళం శ్రీశైలం : లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (21.08.2025) ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి విశేషపూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థాన సేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయ స్వామి వారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణ కోసమై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజనగరములో



నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి. ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చోని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది..

# యూరియా అక్రమ రవాణాపై చర్యలు చేపట్టాలి



**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల టౌన్ : నంద్యాల జిల్లాకు మంజూరైన రాయితీ యూరియా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు అక్రమ రవాణా జరగరాదని... ఇందుకు అవసరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని తన ఛాంబర్ నందు యూరియా అక్రమ రవాణాపై వ్యవసాయ శాఖ, పోలీస్, సివిల్ సప్లై, ఇండస్ట్రీస్, విజిలెన్స్, జెడి పశుసంవర్ధక శాఖ, పొల్యూషన్ బోర్డ్ అధికారులతో కలెక్టర్ జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... రైతు బాగుంటే రాష్ట్రం, దేశం బాగుంటుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. రైతులు వేసే పంటలకు సరిపడే రాయితీ యూరియా వారికి అందించడం జరుగుతుందన్నారు. నంద్యాల జిల్లాలో కొంతమంది... రైతులకిచ్చే రాయితీ యూరియాను దారి మళ్లించి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమస్యను పూర్తిగా నివారించేందుకు సంబంధిత అధికారులు అందరూ ప్రత్యేక చర్యలు తీసుకొని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇచ్చే రాయితీ యూరియా పంట పొలాలకు మాత్రమే వాడాలని, యూరియాను ఇతర అవసరాలకు ఉపయోగించడం మంచిది కాదన్నారు. నంద్యాల పట్టణంలో రాయితీ యూరియాను వివిధ రకాల పరిశ్రమలైన పౌల్ట్రీ ఫీడ్, క్యాటిల్ ఫీడ్, ఆల్కహాల్, ఫ్లై వుడ్ ఇండస్ట్రీస్, ప్లేట్, వస్త్ర పరిశ్రమ మరియు సోప్స్ తయారీ వంటి అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇలా చేయడం వల్ల రైతులకు యూరియా సమస్య తలెత్తే అవకాశం ఉందని, ఇకనుంచి ఇలాంటి కార్యక్రమాలను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# పచ్చదనం పెంపునకు సహకరించాలి

**– ప్రకృతి ప్రేమికులకు ఉచితంగా మొక్కల పంపిణీ**
**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలో విస్తృత హరితీకరణ కార్యక్రమం భాగంగా వేలాది మొక్కలను నాటుతున్నామని, దీనికి ప్రకృతి ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నగరాన్ని పచ్చగా తీర్చిదిద్దేందుకు ప్రతి వాడ, ప్రతి కాలనీ, ప్రతి సంస్థ నుంచి చురుకైన భాగస్వామ్యం అవసరం ఉందన్నారు. జూన్ మాసం నుండి పదివేల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. అశోక్ నగర్ పంప్‌హౌస్ నందు కానుగ, సితాఫల్, బాదం, వేప, రెయిన్ ట్రీ, తదితర మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ప్రకృతి ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, మైదానాల్లో సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. మొక్క నాటడం మొదటి అడుగు మాత్రమే, బాధ్యతగా సంరక్షిస్తేనే అసలు ఫలితం ఉంటుందని చెప్పారు. ప్రతి ఇంటి ముందు, ప్రతి దుకాణం వద్ద, ప్రతి కార్యాలయం, ఎక్కడ మొక్క నాటితే అక్కడ బాధ్యత గల 'ప్లాంట్ గార్డియన్'గా ఒకరు ముందుకు రావాలని సూచించారు. మొక్క బ్రతికితేనే నగరం ఊపిరి పీలుస్తుందని పేర్కొన్నారు.

# అవుకు ఐటిఐ

# మూడో విడత ప్రవేశ ఆహ్వానం..

మన గళం అవుకు : నంద్యాల జిల్లా అవుకు పట్టణంలోని ఐటిఐ కళాశాల నందు విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు మూడో విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల యందు కంప్యూటర్, వెల్డర్ ,డ్రాఫ్ట్ మెన్ సివిల్ , ఎలక్ట్రానిక్స్ మెకానిక్ కోర్సులు గాను దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ఈ దరఖాస్తులు 20.8. 2025 నుండి 26.8.2025 సాయంత్రం 5 గంటలకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని అలా వీలుకాని విద్యార్థులు కళాశాల వద్దకు నిర్దేశించిన తేదీ లోపల పనివేళలో వచ్చిన తామే ఆన్లైన్ లో అప్లై చేస్తామని తెలిపారు. 29.8.25 తేదీన కౌన్సిలింగ్ ఉంటుందని కౌన్సిలింగ్ కి వర్జినల్ సర్టిఫికెట్లు, రెండు ఫోటోలు తీసుకురావాల్సిందిగా తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు 27 తేదీ లోపల ఒరిజినల్ సర్టిఫికెట్స్ ను ఏ ప్రభుత్వ ఐటిఐ కార్యాలయంలోనైనా వెరిఫికేషన్ చేయించుకోవాల్సిందిగా తెలిపారు.

శుక్రవారం
22 - 08 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# డీఎస్సీ మెరిట్ లిస్ట్ విడుదల చేయాలి

**- పాత పద్ధతిలోని టీచర్ పోస్టులు భర్తీ చేయాలి**




మనగళం, కర్నూలు సిటీ : డీఎస్సీ అభ్యర్థులను గందరగోళంని గురిచేసే విధంగా విద్యాశాఖ అధికారుల తీరు ఉందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు , నగర కార్యదర్శి బీసన్న విమర్శించారు. డీఎస్సీ పోస్టు ల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగా జిల్లాల వారీగా మొత్తం డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ లిస్ట్, ర్యాంక్స్ విడుదల చేసిన తర్వాతే సెలెక్ట్ లిస్ట్ విడుదల వారు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సి ఆర్ భవన్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం 16,347 పోస్టుల సంఖ్యకు సమానమైన అభ్యర్థుల మాత్రమే మెసేజ్ లు పంపించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కు ప్రభుత్వం సిద్ధం కావడం తీవ్ర అభ్యంతరకరం అన్నారు. డీఎస్సీ అభ్యర్థులలో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఏ జిల్లాల్లో కటాఫ్ మార్కులు, ఎవరికి ఎన్ని వచ్చాయో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 1:1 నిష్పత్తిలో సెలెక్ట్ చేయడం అనేది చాలా దారుణం. గతంలో ఏ డిఎస్సీకి లేని విధంగా ఈ డీఎస్సీకి నిబంధనలు పెట్టడం సరికాదని, దీన్ని వల్ల చాలా లోటుపాట్లు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. చివరికి పోస్టులు అమ్ముకోవడానికే ఈ రకంగా ప్రభుత్వం చేస్తుందా? అనే అనుమానం డీఎస్సీ అభ్యర్థులలో నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. మెరిట్ లిస్టుపై విద్యాశాఖ మంత్రి స్పందించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని వారి డిమాండ్ చేశారు. అలా కాకుండా కూటమి ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు పోతే ఏఐవైఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ అభ్యర్థులను సమీకరించి పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర నాయకులు చంటి, శివాజీ, అంజి అశోకు తదితరులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక కార్యక్రమాలు




మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (20.08.2025) శ్రీ సూర్య కళాకలర్చరర్ అకాడమి, కర్నూలు వారిచే సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్యం కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గణపతి ప్రార్థన, నమశ్శివాయతే, ఓం నమశ్శివాయ, శివతాండవం, అయిగిరినందిని మహిషాసురమర్దిని తదితర గీతాలకు గీతాశ్రీ, విష్ణుప్రియ, శరణ్య, లక్ష్మి నందిని, నవ్యశ్రీ, గీతాంజలి తదితరులు నృత్యప్రదర్శన చేయడం జరుగుతోంది. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.




# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మనగళం, గూడూరు : వర్షాల మూలంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేసి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోడుమూరు ఇన్ చార్జ్ అనంతరత్నం మాదిగ డిమాండ్ చేశారు. గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బూడిదపాడు గ్రామంలో అకాల వర్షాల వలన దెబ్బతిన్న పంట పొలాలను ఐఎన్ టీయూసి రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎం ఖాద్రి, కాంగ్రెస్ పార్టీ కర్నూల్ సిటీ అధ్యక్షులు షేక్ జిలాని బాషా, నాయకులు ఎం సుంకన్నతో కలిసి అనంతరత్నం మాదిగ పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ 15 రోజుల నుండి ప్రకృతి విపత్తు వలన కర్నూలు జిల్లా అంతట అకాల వర్షాలు కురవడంతో ఉల్లి, పత్తి, వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు పూర్తిగా నష్టపోవడంతో రైతుల పరిస్థితి అయోమయంగా ఉందని, ప్రభుత్వం ఎకరానికి రూ. 30 వేలు పరిహారం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని ఎస్ఎం ఖాద్రి, షేక్ జిలాని బాషా హెచ్చరించారు. కార్యక్రమంలో పంటలు నష్టపోయిన రైతులు పెద్ద సంజీవరెడ్డి, వెంకట్రాముడు, శివ, మౌలాలి, యమునా, ఎం సుధాకర్, వెంకటస్వామి, మాధవస్వామి, కుమార్, సీతారాజు, శివరాముడు, మద్దమ్మ, వీరయ్య, వెంగమ్మ తదితరులు పాల్గొనారు.

# అక్రమంగా తొలగించిన పెన్షన్లు మంజూరు చేయాలి



మనగళం, కర్నూలు సిటీ : అక్రమంగా తొలగించిన పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం మండల కార్యదర్శి హుస్సేనయ్య, మండల నాయకులు రాఘవేంద్ర, బాలపీర బాధితులతో కలిసి కర్నూలు ఎంపీడీవో రఘునాథ్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్ధాంతరంగా లక్షల మంది పెన్షన్లు తొలగించడం దుర్మార్గమన్నారు. కర్నూలు మండలంలో దాదాపు 200 మంది వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పెన్షన్లు తొలగించడం అన్యాయం అన్నారు. వీరి పొట్ట కొట్టడమే మంచి ప్రభుత్వమా అని ప్రశ్నించారు. వెంటనే తొలగించిన పెన్షన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బాధితులందరికీ న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటస్వామి, నాయకులు అహ్మద్ హుస్సేన్ బాధితులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు న్యాయం చేయాలి



మనగళం, కర్నూలు సిటీ : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ కు కనీసవేతనం రూ. 26 వేలు జీతం ఇచ్చి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రేణుకమ్మ, చౌడేశ్వరి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కర్నూలు అర్బన్ తహసీల్దారు ఆఫీస్ ముందు అంగన్వాడీ వర్కర్స్ నాయకులు బాలద్దగ్గమ్మ అధ్యక్షతన నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటగా అంగన్వాడి మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లు గా మార్చి కార్మికులకు ప్రమోషన్ ఇచ్చినందుకు కూటమి రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అయితే పదిమంది పిల్లల కంటే తక్కువగా ఉన్న మినీ సెంటర్లను రద్దు చేయడానికి వ్యతిరేకిస్తున్నామన్నారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలని,అనవసరమైన యాప్లను రద్దుచేసి ఒకే యాప్ ను అమలు చేయాలని,సంక్షేమపథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న తల్లులు, చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారం లోపం రాకుండా ఆరోగ్యకరంగా ఎదగడానికి అవసరమైన తిండిని, ఆరోగ్యసలహా సూచనలు ఇవ్వడానికి పిల్లలకు చదువు పట్ల ఆసక్తి పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్ ద్వారా స్కీంను కొనసాగిస్తుందని తెలిపారు. ఈ స్కీమును భుజాన వేసుకొని అంగన్వాడీ కార్యకర్తలు కష్టపడి పని చేస్తున్న ప్రభుత్వాలు వారికి కనీస వేతనం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. వీరిని స్కీం వర్కర్లని చెబుతూనే సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ఈ ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. పరిస్థితుల కనుగుణంగా పెరిగిన ధరలను బట్టి మాకు జీతాలు పెంచాలని కోరుతూ గత ప్రభుత్వ కాలంలో 42 రోజులు సమ్మె చేస్తే రాతపూర్వకంగా రాసి ఇచ్చి మోసం చేశారని, అందుకే ఆ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపారని అన్నారు. కార్మికుల దీక్ష శిబిరాల ముందుకు వచ్చి హామీలు ఇచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి సంవత్సరం పూర్తి అయిన సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఇప్పుడైనా కూటమి ప్రభుత్వం అంగన్వాడీల బాధలను అర్థం చేసుకొని, సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విజయ, రామాంజనేయులు, సాయిబాబా, మహమూద్, ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, రామాంజి, అంగన్వాడీ వర్కర్స్ నాయకులు విజయలక్ష్మి, విజయమ్మ, కళ్యాణి, లక్ష్మి దేవి, నాగేశ్వరి, చౌడేశ్వరి,రాధికా, భాగ్యమ్మ, వరలక్ష్మి, పార్వతి, అంజలి, సునంద తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వేతనాలు పెంచాలి సిఐటియు డిమాండ్



మన గళం గూడూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం లోని గూడూరు పట్టణంలో గూడూరు ఎమ్మార్వో కార్యాలయం నందు అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడి కార్మికులు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి

జే, మోహన్. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గూడూరు మండల నాయకురాళ్ళు

రత్నమ్మ,సునంద, చాంద్ బి పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను మరియు వేతనాలు పరిష్కరించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 2014లో వేతనం పెంచిందని. రాష్ట్ర ప్రభుత్వం 2019లో వేతనం పెంచే రని అప్పటినుండి వేతనాలు పెంచకుండా అంగన్వాడీలకు కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని ఉన్న ఎన్నికల ముందు అంగన్వాడీ సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు తప్ప అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడి లకు వేతనాలు పెంచకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. అంగన్వాడీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వేతనాలు పెంచాలని . ఎఫ్ ఆర్ ఎస్ యాప్ ను రద్దు చేయాలని. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో పాల్గొని మేము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని,అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారని ఇప్పటికీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, వెంటనే చంద్రబాబు నాయుడు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంగన్వాడీల యాప్ లన్నీ కలిపి ఒకే యాపుగా చేయాలని, ఎఫ్ ఆర్ ఎస్ ను రద్దు చేయాలని, ప్రధానమంత్రి మాతృ వందనం పథకాన్ని అంగన్వాడీలకు అప్పగించరాదని, సెంటర్ నిర్వహణకు ఫైజీ నెట్ గల ట్యాబులను ఇవ్వాలని, అర్హులైన అంగన్వాడి టీచర్లకు సూపర్వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని, అర్హులైన ఆయాలకు టీచర్లుగా ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, అదేవిధంగా గ్రాచుటీ జీవోలో మార్పులు చేసి అంగనవాడిలకు తగిన న్యాయం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు. అనంతరం. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర రెడ్డి గారికి ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్మికులు రామాంజనమ్మ, ప్రేమమ్మ, చాంద్ బి, రామలక్ష్మి, వరలక్ష్మి, మేరీ, సులోచన, దస్తగిరి అమ్మ, రామేశ్వరమ్మ, అంగన్వాడి కార్మికులు పాల్గొన్నారు. అభివందనములతో జే,మోహన్ సిఐటియు డివిజన్ కార్యదర్శి, గూడూరు

# ఫ్రీ బస్సు పథకం లక్షలాది ఆటో కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేసింది వారిని ప్రభుత్వమే ఆదుకోవాలి




మన గళం కోడుమూరు: కోడుమూరు టీడీపీ ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన ఫ్రీ బస్సు పథకం రాష్ట్రంలో లక్షలాది ఆటో కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేస్తోందని సిపిఐ పట్టణ కార్యదర్శి శేషుకుమార్ విమర్శించారు ఈ కార్యక్రమానికి జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మధు, అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి శేషుకుమార్,ఎఐటియుసి తాలూకా అధ్యక్షులు చిన్న రాముడు, ఎఐఎస్ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రంగస్వామి లు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ ప్రభుత్వాలు వుద్యోగ అవకాశాలు కల్పించలేని కారణంగా ఉపాధికోసం ఆటో రంగాన్ని ఎంచుకొన్నారని అన్నారు. బ్యాంక్ లనుండి, ప్రయివేట్ ఫైనాన్స్ ల నుండి అప్పులు తెచ్చుకొని నెలవారీగా ఈఎంఐలు చెల్లించుకొని ఆటో కార్మికులు బ్రతుకు సాగదీస్తున్నారని వారు అన్నారు. అటువంటి వారి సంక్షేమన్ని ఆలోచించకుండా ఫ్రీ బస్సు పథకం ప్రవేశ పెట్టడం దారుణమాని అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమాన్ని సి ఎం చంద్రబాబు నాయుడు విస్మరిస్తే భారీ ఎత్తున ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు చిన్న, నాగరాజు, దస్తగిరి, రాఘవేంద్ర, మధు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బోల్డ్ సీన్స్‌తోనే నాకు అవకాశాలు



మన గళం, సినిమా : సినిమా ప్రపంచం అనగానే మనకు గుర్తుకొచ్చేది గ్లామర్. హీరోయిన్లకు అవకాశాలు రావాలంటే అందాలు, స్టైల్, హాట్ లుక్స్ ప్రదర్శించాల్సిందే అన్న మాట ఎప్పటి నుంచో వినిపిస్తోంది. కానీ అందాల ప్రదర్శనతో పాటు మంచి నటన, అదృష్టం కూడా కలిసొస్తేనే వారు స్టార్ హీరోయిన్లుగా ఎదుగుతారు. కేవలం గ్లామర్ మీద ఆధారపడితే ఒకట్రెండు సినిమాలకే పరిమితమవ్వాల్సి వస్తుంది. అలాంటి ఉదాహరణలతో పాటు గ్లామర్ లేకుండా కూడా స్టార్ హీరోయిన్లుగా ఎదిగిన సావిత్రి, సౌందర్య లాంటి నటి మణులు ఉన్నారు. నేటితరం ప్రేక్షకులను తన నటనతో కట్టిపడేసిన కీర్తి సురేష్ కూడా తొలినాళ్లలో చాలా పద్ధతిగా కనిపించింది. కానీ ఇప్పుడు పోటీని ఎదుర్కొని అవకాశాలు దక్కించుకోవాలంటే గ్లామర్ కూడా అవసరమని అర్థం చేసుకుంది. ఈ నేపథ్యంలో మిల్కీ బ్యూటీగా పేరు తెచ్చుకున్న తమన్నా భాటియా ను ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. అమాయకమైన ముఖకవళికలు, పాలలాంటి శరీర కాంతి, లేలేత అందాలతో తన కెరీర్ ప్రారంభంలో చాలా క్యూట్‌గా కనిపించిన తమన్నా, 20 ఏళ్లకు పైగా ఇండస్ట్రీలో కొనసాగుతోంది. తొలి సినిమాల్లో పద్ధతిగా కనిపించిన ఆమె, కొంతకాలం తర్వాత అవకాశాలు తగ్గిపోవడంతో రూట్ మార్చుకోవాల్సి వచ్చింది. ఆ సమయంలోనే ఆమె గ్లామర్ వైపు అడుగులు వేసింది. ఆ మార్పే ఆమె కెరీర్‌కు కొత్త ఊపిరి నిచ్చింది. సౌత్ ఇండస్ట్రీలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా తమన్నా తన గ్లామర్‌తో గుర్తింపు తెచ్చుకుంది. ఐటెం సాంగ్స్‌లో తన హాట్ డ్యాన్స్ మూవ్స్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. 'జైలర్', వంటి సినిమాల్లో ఐటెం సాంగ్స్ చేసిన ఆమె నార్త్ నుంచి సౌత్ వరకు తన ఫ్యాన్ బేస్‌ను మరింత పెంచుకుంది. ఘాటు రొమాన్స్ సీన్స్, లిప్‌లాక్‌లతో వెండితెరకు వేడి పుట్టించింది. ఇక సోషల్ మీడియాలో అయితే తమన్నా హాట్ హాట్ ఫోటోషూట్స్ రెగ్యులర్‌గా వైరల్ అవుతుంటాయి. ఆమె నడుము అందాలకే ప్రత్యేకమైన అభిమాన గణం ఉందనడం అతిశయోక్తి కాదు.

# వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్, కోహ్లీ మిస్సింగ్..





మన గళం, : భారత క్రికెట్ అభిమానులకు షాకింగ్‌గా అనిపించే ఒక వార్తను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పేర్లు కనిపించలేదు. ఈ ఇద్దరూ భారత క్రికెట్‌కు నిలువుటద్దాల్లాంటి వారు. రోహిత్ తన అద్భుతమైన కెప్టెన్సీతో, విరాట్ తన అద్భుతమైన బ్యాటింగ్ ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. అటువంటి స్టార్ ఆటగాళ్లు ర్యాంకింగ్స్‌లో కనిపించకపోవడం సహజంగానే అభిమానుల్లో ఆశ్చర్యాన్ని రేకెత్తించింది.అసలు ఈ విషయం ఎందుకు జరిగింది అనే ప్రశ్న చాలామందికి వస్తోంది. దీని వెనుక కారణం ఐసీసీ ర్యాంకింగ్ నిబంధనల్లోనే దాగి ఉంది. ఆటగాళ్ల ర్యాంకింగ్స్ అనేది వారు ఆడిన మ్యాచ్‌ల సంఖ్య, ప్రదర్శన స్థాయి, క్రమంగా ఆటలో కొనసాగుతున్న ఫామ్ ఇలా పలు అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఐసీసీ నియమాల ప్రకారం, ఒక ఆటగాడు ర్యాంకింగ్స్‌లో కొనసాగాలంటే కనీసం ఒక నిర్దిష్ట కాల వ్యవధిలో కొన్ని మ్యాచ్‌లు ఆడాలి. లేనిపక్షంలో అతని పేరు ఆటోమేటిక్‌గా ర్యాంకింగ్స్‌లోంచి తొలగిపోతుంది. ఐసీసీ విడుదల చేసిన తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరి పేర్లు టాప్-10లో లేవు. గత వారం ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ 756 పాయింట్లతో రెండో స్థానంలో, విరాట్ కోహ్లీ 736 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నారు. కానీ ఇప్పుడు భారత ఆటగాళ్లలో శుభ్‌మన్ గిల్ 784 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. శ్రేయస్ అయ్యర్ 704 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నారు. ప్రస్తుతం పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ అజామ్ రెండో స్థానంలో ఉన్నాడు. టాప్-20లో ఉన్న మరో భారత ఆటగాడు కేఎల్ రాహుల్ 638 పాయింట్లతో 13వ స్థానంలో ఉన్నాడు. ఆగస్టు 20న విడుదలైన ర్యాంకింగ్స్‌లో శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ మాత్రమే టాప్ 10లో ఉన్నారు.అయితే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు ఐపీఎల్ 2025 తర్వాత ఏ మ్యాచ్ ఆడలేదు. భారత జట్టు తరఫున వారి చివరి మ్యాచ్ మార్చిలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ కావడం గమనార్హం. ఈ టోర్నమెంట్‌లో రోహిత్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి పదేళ్ల తర్వాత భారత్‌కు ఐసీసీ వన్డే ట్రోఫీని అందించారు. కోహ్లీ కూడా గ్రూప్ దశల్లో అద్భుతంగా రాణించారు.

# అక్షర్ పటేల్‌ను వైస్ కెప్టెన్సీ నుంచి ఎందుకు తొలగించారో వివరణ ఇవ్వాలి

మన గళం, ఆసియా కప్ 2025 కోసం భారత క్రికెట్ జట్టును ప్రకటించిన తర్వాత ఇప్పటికే తీవ్ర చర్చ, అసహనం ప్రారంభమైంది. ముఖ్యంగా జట్టులో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ వైస్-కెప్టెన్ బాధ్యత నుంచి ఆకస్మికంగా తొలగించబడిన విషయం అభిమానుల, మాజీ క్రికెటర్లను ఆశ్చర్యపరిచింది. ఈ నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'అక్షర్ పటేల్ ఎలాంటి తప్పు చేయలేదు. అతడిని వైస్-కెప్టెన్సీ నుంచి ఎందుకు తొలగించారో సెలెక్టర్లు సరైన వివరణ ఇవ్వాలి' అని కైఫ్ డిమాండ్ చేశారు.ఆసియా కప్ కోసం సెలెక్ట్ చేసిన జట్టులో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌గా కొనసాగుతున్నాడు. వైస్-కెప్టెన్‌గా వైపు శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేశారు. అయితే, ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అక్షర్ పటేల్ భారత జట్టుకు వైస్-కెప్టెన్‌గా పనిచేశారు. ఆ సిరీస్‌లో పటేల్ తాను ఎదుర్కొన్న పరిస్థితులను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించి జట్టుకు మద్దతు నడిపించాడు. కానీ ఇప్పుడు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అతడిని వైస్-కెప్టెన్ బాధ్యత నుంచి తొలగించడం, మరియు ఒక సంవత్సరం పైగా జట్టులో లేకపోయిన శుభ్‌మన్ గిల్‌కు ఆ బాధ్యతను అప్పగించడం, సెలెక్టర్ల నిర్ణయంపై పలు ప్రశ్నలు లేవనెత్తుతోంది. అక్షర్ పటేల్ అనేక మ్యాచ్‌లలో అద్భుత ప్రదర్శనతో భారత జట్టుకు విశేష మద్దతు అందించారు. ఒక సార్వత్రిక ఆటగాడు, జట్టులో నాయకత్వం చూపే అవకాశం ఉన్న అక్షర్ పటేల్‌ను అకస్మాత్తుగా వైస్-కెప్టెన్ నుంచి తొలగించడం అభిమానులు, విశ్లేషకులను విపరీతంగా అసహనానికి గురి చేసింది.ఈ నిర్ణయంపై మహ్మద్ కైఫ్ తన ఎక్స్ ఖాతాలో స్పందిస్తూ.. 'వైస్-కెప్టెన్సీ నుంచి తొలగించిన విషయం గురించి సెలక్షన్ కమిటీ అక్షర్ పటేల్‌కు ముందుగానే తెలియజేసి ఉంటుందని ఆశిస్తున్నాను. ప్రెస్ కాన్ఫరెన్స్ చూసి అతడు ఈ విషయం తెలుసుకుని ఉండకూడదు. అక్షర్ ఎలాంటి తప్పు చేయలేదు, కాబట్టి అతడికి దీనిపై వివరణ ఇవ్వాలి' అని ఘాటుగా పోస్ట్ చేశారు. ఇటీవలి కాలంలో అక్షర్ పటేల్ భారత టీ20 జట్టులో కీలక ఆటగాడిగా మారారు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ అతను నిలకడగా రాణిస్తున్నారు. ముఖ్యంగా, 2024 టీ20 ప్రపంచ కప్‌ను గెలిచిన భారత జట్టులో అక్షర్ పాత్ర చాలా కీలకమైనది. సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కూడా గెలుచుకున్నారు. అంతేకాకుండా 2025 ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు అక్షర్ పటేల్ కెప్టెన్‌గా కూడా వ్యవహరించారు. ఇంత అద్భుతమైన ప్రదర్శన తర్వాత కూడా అతడికి సరైన గౌరవం లభించలేదన్న ఆవేదన మాజీ ఆటగాళ్లు, అభిమానుల మధ్య వ్యక్తమవుతోంది. అక్షర్ ను వైస్-కెప్టెన్సీ నుంచి తొలగించడం, ఆటగాళ్ల మధ్య నిరాశను సృష్టించవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అందుకే సినిమాలు తగ్గించాను



మన గళం, సినిమా : నటిగానే కాకుండా నిర్మాతగానూ సరికొత్త కథలను ప్రేక్షకులకు అందిస్తూ అగ్ర కథానాయిక సమంత ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా ఈ బ్యూటీ ప్రముఖ మ్యాగజైన్ 'గ్రాజియా ఇండియా' లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై మెరిసిన విషయం తెలిసిందే. ఎన్ని సినిమాలు చేశామనేది కాదని.. ఎంత మంచి చిత్రాలు తీశామనేది ముఖ్యమని సమంత చెప్పారు. 15 సంవత్సరాలుగా ఇండస్ట్రీలో తన ప్రత్యేకతను చాటుకుంటోన్న ఆమె ప్రస్తుతం సినిమాలతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. "గతంతో పోలిస్తే ఇప్పుడు నాలో ఎంతో మార్పు వచ్చింది. గొప్ప పనులు చేసే స్థాయికి చేరుకున్నాను. ఫిట్‌నెస్, సినిమాలు రెండిటిపైనా దృష్టిపెట్టాను. మంచి సినిమాలు, సిరీస్‌లలో భాగమయ్యాను. అవన్నీ కేవలం ప్యాషన్ కోసమో, గుర్తింపు కోసమో చేసేవి కావు. అన్నీ నా మనసుకు దగ్గరగా ఉన్న కథలే" "తక్కువ ప్రాజెక్ట్‌లు చేయాలని నిర్ణయించుకున్నా. శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నా. ఇకపై ఒకేసారి ఐదు సినిమాలు చేయను. నా శరీరం చెప్పేది వినాలని తెలుసుకున్నా. అందుకే పనిని తగ్గించుకున్నా. కానీ, తక్కువ చేసినప్పటికీ ప్రేక్షకుల మనసుకు నచ్చే వాటితోనే పలకరిస్తాను. ప్రాజెక్ట్‌ల సంఖ్య తగ్గింది.. కానీ, వాటి నాణ్యత కచ్చితంగా పెరుగుతుంది" అని చెప్పారు. ఇక సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే సమంత అందులో వచ్చే ప్రశంసలతో పాటు విమర్శలను కూడా స్వీకరించగలగాలని తెలిపారు. "నేను సామాజిక మాధ్యమాల్లో సాధ్యమైనంత వరకు వాస్తవంగా ఉండడానికి ప్రయత్నిస్తాను. కామెంట్స్‌లో వచ్చే ప్రశంసలకు ఎలా ఆనందిస్తామో.. ట్రోలింగ్, నెగెటివ్ కామెంట్స్‌ను కూడా అంతే హుందాగా స్వీకరించగలగాలి. మీరు దాన్ని కంట్రోల్ చేయగలగాలి కానీ, అది మీ జీవితాన్ని పూర్తిగా నియంత్రించకూడదు" అని తెలిపారు.

# 'కన్యా కుమారి' మంచి సినిమా అవుతుంది

మన గళం, సినిమా : ప్రముఖ నటి మధు శాలిని సమర్పకురాలిగా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. రాడికల్ పిక్చర్స్ బ్యానర్ పై సృజన్ అట్టాడ రచన, దర్శకత్వం, నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ "టీజర్ చాలా బాగుంది. శ్రీచరణ్, గీత్ చక్కగా నటించారు. క్యారెక్టర్స్‌లో ఒదిగిపోయారు. కచ్చితంగా ఇది చాలా మంచి సినిమా అవుతుందని నమ్మకం కలిగింది"అని అన్నారు. మూవీ సమర్పకురాలు మధు శాలిని మాట్లాడుతూ "సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. శ్రీ చరణ్, గీత్ వాళ్ళిద్దరు కూడా అక్కడే పుట్టి పెరిగినట్టు నటించారు. బన్నీ వాసు సపోర్ట్‌తో ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నాము. సృజన్ అద్భుతమైన సినిమాని మన ముందుకు తీసుకొచ్చారు. తప్పకుండా ఈ సినిమాని థియేటర్స్ లో చూసి ఆస్వాదించాలని కోరుకుంటున్నాను"అని తెలిపారు. డైరెక్టర్ సృజన్ మాట్లాడుతూ "సినిమాలో పాత్రలన్నీ కూడా రియల్ లైఫ్ నుంచి వచ్చినవే. ఈ సినిమాలో చాలా మంచి డ్రామా ఉంది"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శశి కుమార్ తిక్క, హీరోయిన్ గీత్ సైని, శ్రీ చరణ్ పాల్గొన్నారు.



# అవుకు కు మంచి పేరు తీసుకొని రండి...చల్లా.



మన గళం అవుకు : బాగా చదివి మంచి స్థాయికి వెళ్లి అవుకు కు మంచి పేరు తీసుకొని రావాలి అని కోరుకుంటున్నట్లు చల్లా విఘ్నే శ్వర్ రెడ్డి గురువారం అన్నారు. ఇటీవల నిర్వహించిన నీట్ పీజీ ఎంట్రన్స్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆలిండియాలో 1185 ర్యాంకు సాధించిన కుమ్మిత సంజీవరెడ్డి కుమార్తె లక్ష్మీ కీర్తనను స్థానిక చల్లా కార్యాలయం నందు శాలువా కప్పి మెడల్ తో చల్లా విఘ్నేశ్వర రెడ్డి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంట్రెన్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు , మన గ్రామానికి దేశ స్థాయిలో మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చినందుకు గర్వకారణంగా ఉందని, మీ మీ రంగాలలో ఇంకా ఉన్నతంగా రాణించి రాబోయే తరానికి మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310